క్లుప్తంగా

15న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 15న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పరిరక్షించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లింగన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు పంపిణీ

కడప స్పోర్ట్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో కడప గాంధీనగర్ నగరపాలకోన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు సీఆర్ఐ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సీఆర్ఐ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ సునీల్ జయంత్ విచ్చేసి వాలీబాల్, కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. బీసీ సంఘం నాయకుడు గోవిందు నాగరాజు , 21వ డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి మోతుకూరి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుపై పార్టీలు తమ వైఖరి ప్రకటించాలి

వైవీయూ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దుపై రాజకీయ పార్టీలు తమ వైఖరి ఏంటో ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. విజయకుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం కడప నగరంలోని జిల్లా యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కోశాధికారి దావుద్దీన్, కార్యదర్శి ఎజాస్‌అహ్మద్, కన్వీనర్ ప్రభాకర్, కరీముల్లా, వెంకటసుబ్బయ్య, సుజిత్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్ పదోన్నతులు కల్పించాలి

వైవీయూ : రాష్ట్ర ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రామాంజనేయులు కోరారు. శనివారం కడప నగరంలోని ఓ పాఠశాలలో నిర్వహించిన ఎస్టీఎఫ్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంటనే పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల ప్రారంభంలోపు పుస్తకాలు, బ్యాగులు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్ర, జిల్లా నాయకులు సాగర్, వెంకటసుబ్బయ్య, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం



కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రావడంతో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: 2024లో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రావడంతో నాయకులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చార్లెస్, జార్జ్ లూయిస్, చెప్పలి పుల్లయ్య, లక్ష్మయ్య, కుళ్ళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

– కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, ఏఐసీసీ మెంబర్ బండి జకరయ్య పేర్కొన్నారు. శనివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సుమంత్ కుమార్, తిరుమలేష్, చెప్పలి పుల్లయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని మృతదేహం



కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో వైద్య సేవల కోసం ఫిబ్రవరి 28న శంకరయ్య (55) పేరుతో చేరాడు. పరిస్థితి విషమించడంతో శనివారం ఆయన మృతి చెందాడు. అతని ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

శ్రీ ఆంజనేయం

హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి



కడప కల్చరల్ : హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం కడప నగరలలోని అన్ని హనుమంతుని ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహించనున్నారు. గణపతిపూజ, రుద్రాభిషేకం, గణపతి, మృత్యుంజయ హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కొన్నిచోట్ల శనివారం నాడు ఉత్సవాల ప్రారంభ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మరికొన్ని ఆలయాల్లో ఆదివారాలు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

– ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో గల హనుమంతుని ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి హనుమంతుని మూల విరాట్‌కు స్నపన తిరుమంజనం, వడమాల సేవ, నాగవల్లి దళాలతో అష్టాదళ శతనామార్చాన, సాయంత్రం తులసీదళార్చన నిర్వహించనున్నారు.

– బ్రాహ్మణవీధిలోని ఝూల ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. స్థానిక పాత బస్టాండులోని శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం, టీటీడీ కళాకారులతో హరికథా గానం, భజనలు జరగనున్నాయి. మూల విరాట్‌కు విశేష అభిషేకాలు, అలంకారం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు బ్రహ్మంగారిమఠం శ్రీ అచలానంద ఆశ్రమ నిర్వాహకులు స్వామి విరిజానంద ప్రవచనం నిర్వహిస్తారు. సాయంత్రం స్వామిని పల్లకీలో ఊరేగించనున్నారు. మైదుకూరు పార్వతీనగర్ కళాకారులు ఈ సందర్భంగా రామాయణంలోని ముఖ్య ఘట్టాలను వేషధారణలతో సహా ప్రదర్శించనున్నారు. శంకరాపురం శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో సుప్రభాతం, అలంకారం, వడమాల సేవ, ఆకుపూజ, మన్యసూక్త పారాయణం, తిలక్‌నగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో అష్టోత్తర శతనామార్చాన, ఉదయం 9.30 గంటలకు హోమాలు, పూర్ణాహుతి, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6.30 గంటలకు వడమాల సేవ ఉంటుంది.

– చిన్నచౌకు శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో పరిమళ ద్రవ్యాలతో విశేష అభిషేకం, తిరు ఆరాధన, అమ్మవారిశాలలోని ఆంజనేయస్వామి మండపంలో ఆకుపూజ, సహస్ర నామార్చాన, నెహ్రూనగర్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ఆకుపూజ, మన్యసూక్త పూజలు, రుద్ర, లక్ష్మి హోమాలు, వక్కలపేట ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ, వడమాల సేవ నిర్వహిస్తారు. నగరంలోని ఇంకా ఇతర ఆంజనేయస్వామి ఆలయాలు, మందిరాలలో కూడా పూజలు జరగనున్నాయి.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మ అమ్మవారు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: పట్టణ పరిధిలోని చెరువుకట్ట పై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతున్న సుంకులమ్మ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని రెండోరోజు శనివారం అమ్మవారికి మహా గణపతి పూజ, అభిషేకంంంం, హోమాలు, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం విశేష పూజలు, పంచ అష్టోత్తరం, అమ్మవారికి కుంకుమార్చన, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. కాగా సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ, నిర్వాహకులు చవ్వారెడ్డి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కాగా మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీఎస్ నారాయణ రెడ్డి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తిరునాల మహోత్సవాలకు హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆలయ నిర్వాహకులు ఆయనను పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శాలువ కప్పి, ఘనంగా సత్కరించారు. అలాగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 11 కాండ్లు వచ్చాయి.

గెలుపొందిన ఎద్ల యజమానులకు వరుసగా రూ. 50 వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు గంగాధర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రహంతుల్లా, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఎన్సీ పుల్లారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, ఇర్ఫాన్, రెడ్డి కరీం, సున్నపు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతున్నాయ్...





కడప కార్పొరేషన్: జిల్లాలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. ఖాజీపేట సమీపంలోని పుల్లూరు, ఆంజనేయకొట్టాలు, జీవీ సత్రం మార్గంలో చాలా విద్యుత్ స్తంభాలు పూర్తిగా ఒరిగిపోయాయి. పెద్ద గాలివాన వస్తే అవి పొలాల్లోకి పడిపోక తప్పదు. ఆ పరిస్థితి రాకమునుపే ఇలాంటి వాటిని గుర్తించి చక్కగా నిలబెట్టాలని పలువురు కోరుతున్నారు.

ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి పవన్‌కల్యాణ్‌కు లేదు

– సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్‌రామాంజులరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి పవన్‌కల్యాణ్‌కు లేదని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ తీరు జనసేన కార్యకర్తలనే అయోమయానికి గురిచేసేలా ఉందన్నారు. రోజుకో మాట, గంటకో మాట, నిముషానికి ఒకలా ప్రవర్తిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఎవరైనా ఎన్నికల సమయంలో పొత్తులు పెట్టుకుంటారని, ఈయన ఎన్నికలు రాకముందే పొత్తులకు తహతహలాడుతున్నాడన్నారు. ఎన్నికల్లో పొత్తు ఉంటుంది అంటూనే మళ్లీ దానికి విధి విధానాలు తయారు కాలేదని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. ప్యాకేజీ ఇంకా ఖరారు కానందునే పొత్తుపై విధివిధానాలు తయారు కాలేదని చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. జనసేన పార్టీ కోసం పనిచే స్తున్న కార్యకర్తల మనోభావాలు పరిగణలోకి తీసుకోకుండా, పార్టీని తీసుకుపోయి చంద్రబాబు కాళ్ల వద్ద తాకట్టు పెడుతున్నాడన్నారు. కులానికి, ప్రాంతానికి ముడిపెట్టి రాజకీయాలు చేస్తున్నారన్నారు. స్పందన లేని వాడు నాయకుడు కాలేడని, పవన్ కల్యాణ్ కూడా ఆ కోవలోకే వస్తాడన్నారు. సినిమాల్లో మాత్రమే ఆయన స్టార్ అని, రాజకీయాల్లో అలా అనిపించుకోవాలంటే ప్రజలకు మంచి చేయాలన్నారు. పార్టీ ఎందుకు పెట్టాడో కూడా పవన్ కల్యాణ్‌కు తెలియడం లేదన్నారు. ఆంధ్రా రాజకీయాల్లో ఆయన చివరికి కమెడియన్‌గా కూడా నిలవలేడని జోస్యం చెప్పారు. తన మనుగడ కోసం, ప్యాకేజీ కోసమే పవన్‌కల్యాణ్ జనం వద్దకు వస్తున్నారని, ఆ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జులు ఐస్‌క్రీం రవి, సుబ్బరాయుడు, ఎస్సీసెల్ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలి



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్: భవిష్యత్తు తరాల కోసం పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతుగా తోడ్పాటు అందించాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారి జావెద్‌బాష తెలిపారు. దేశ ప్రధాని పిలుపు మేరకు మిషన్ లైఫ్ ప్రపంచ ప్రజా ఉద్యమంలో భాగంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి కడపప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని కోటిరెడ్డిసర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జావెద్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో కాలుష్యం పెరిగిపోయిందన్నారు. పర్యావరణ కాలుష్యం కారణంగా మనిషి మనుగడకే ప్రమాదం వాటిల్లే స్థితులు నెలకొన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు కృషి చేయాలని సూచించారు. అందరి సహకారంతోనే పర్యావరణ రక్షణ సాధ్యపడుతుందని సూచించారు. ర్యాలీకి ముందు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ అధికారి సి.అనిల్‌కుమార్‌రెడ్డి, జువారి సిమెంట్స్ ప్రతినిధి మాధవరెడ్డి, భారతి సిమెంట్స్ ప్రతినిధి ఓబుల్ రెడ్డి, ఇండియా సిమెంట్స్ ప్రతినిధి రిజ్వాన్ బాష, నంది కెమికల్స్ ప్రతినిధి చాంద్‌బాషతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, పరిశ్రమల నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.

పార్ట్‌టైం టీచర్స్‌ను రెన్యువల్ చేయాలి



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా పార్ట్‌టైం టీచర్స్

వైవీయూ : విద్యాశాఖలో పార్ట్‌టైం టీచర్స్‌గా పనిచేస్తున్న వారిని 2023–24 విద్యాసంవత్సరానికి రెన్యువల్ కొనసాగించాలి జిల్లా పార్ట్‌టైం టీచర్స్ సంఘం ప్రతినిధులు కోరారు. శనివారం కడప నగరంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే యేడాదికి సంబంధించి డెమో ఇవ్వాలని అధికారులు పేర్కొనడం సరికాదని అన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్సీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు.

2003 డీఎస్సీ ఉపాధ్యాయుల వివరాలు పంపాలి

కడప ఎడ్యుకేషన్ : 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల జాబితాను వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, కడప అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్, ఆలీఖాన్, చెంగల్ రెడ్డిలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంవత్సరం క్రితమే సదరు వివరాలు రాష్ట్ర విద్యా శాఖ అడిగినా రాష్ట్రంలో కొన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయాలు ఇప్పటివరకు పంపించకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తాజా ఉత్తర్వుల మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు అందరూ కూడా ఓపీఎస్ పరిధిలోకి త్వరలో రానున్నారని తెలిపారు.

వెండి ఆభరణాల వితరణ

మైదుకూరు : పట్టణంలోని పార్వతి సమేత భీమేశ్వర స్వామి, లక్ష్మీ మాధవరాయ ఆంజనేయస్వామి సమూహ దేవాలయంలో వెలసిన ఆంజనేయస్వామికి మైదుకూరుకు చెందిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సొద్దల గురప్ప 6.5 కిలోల వెండి ఆభరణాలను చేయించి వితరణ చేశారు. శనివారం ఆలయంలో సమూహ దేవస్థానాల ఈఓ ప్రసాదరావు, చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు సమక్షంలో సొద్దల గురప్ప, వెంకటసుబ్బమ్మ దంపతులు రూ.5.50 లక్షల విలువైన కవచం, నామాలు, కిరీటం, చేతులు, పాదాలు, నేత్రాలు వంటి ఆభరణాలను అందజేశారు. ఈ సందర్భంగా సొద్దల గురప్ప దంపతులను ఆలయం తరపున ఈఓ, చైర్మన్, సభ్యుడు ఎలిశెట్టి ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్లు బండి సుబ్బరాయుడు, సింగయ్యగారి రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సొద్దల సురేష్, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ సొద్దల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలలో భక్తుల సందడి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పలు ఆలయాలలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయచోటి–వేంపల్లి రహదారి మార్గంలోని మర్రి చెట్టు వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించారు. రాచపల్లి సమీపంలోని నామాలగుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెడ్డివారిపల్లి రోడ్డు మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరబల్లిలో..

వీరబల్లి(రాయచోటి టౌన్) : వీరబల్లె మండలం మట్లి గ్రామం వండెపల్లెలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు.

మండెం లక్ష్మీనరసింహస్వామికి..

చిన్నమండెం : మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌ను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రమోద

కడప రూరల్ : ప్రతి మంగళవారం కడప ఆర్టీసీ బస్టాండు సమీపంలోగల మాతృశ్రీ ఐవీఎఫ్ క్లినిక్‌లో నిర్వహించే ఉచిత సంతాన సాఫల్య సలహా చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్ ఫెర్టిలిటీ స్పెషలిస్టు డాక్టర్ వై.ప్రమోద తెలిపారు. శనివారం స్థానిక సురక్ష సూపర్ హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి మంగళవారం తమ క్లినిక్‌లో మధ్యాహ్నం 12.00 నుంచి 2.00 గంటల వరకు సంతాన లేమి సమస్యతో బాధపడే దంపతులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరానికి భార్యాభర్తలు ఇద్దరూ కలిసి రావాలన్నారు. ఉచిత కన్సల్టేషన్‌తోపాటు మహిళలకు స్కానింగ్, పురుషులకు సెమెన్ అనాలసిస్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. అపాయింట్‌మెంట్ కోసం సెల్ నెంబరు 79956 29110 నెంబరులో సంప్రదించాలన్నారు.

ప్రైవేట్ సంస్థతో 'మను' ఒప్పందం

వైవీయూ: కడప నగరంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ (మాను), కడపకు చెందిన పీఎస్ డిజైన్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. పాలిటెక్నిక్ సివిల్ విద్యార్థులకు ఆర్కిటెక్ డిజైన్స్, శిక్షణ, ఉపాధి అవకాశాలపై ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహమ్మద్ సికిందర్ హుస్సేన్ తెలిపారు. అనంతరం సంస్థ ఎండీ ఇంతియాజ్ అహ్మద్‌తో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

దూదేకులు విద్యావంతులుగా ఎదగాలి

కడప సెవెన్‌రోడ్స్ : దూదేకుల కులస్తులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని లెవెన్త్ బెటాలియన్ రిటైర్డ్ కమాండెంట్ రాజకిశోర్‌బాబు అన్నారు. శనివారం కడప ఎర్రముక్కపల్లెలోని దూదేకుల భవన్‌లో నిర్వహించిన ఆ సంఘ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన సమాజాలే అభివృదిద్ధి చెందాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దూదేకుల కులస్తులు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఉమ్మడి కడపజిల్లాలో పదవ తరగతిలో 550కు పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన దూదేకుల విద్యార్థులకు నగదు పారితోషికం, తమ సంఘం తరుపున గుర్తింపు పత్రాలను అందించనున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హతలున్న విద్యార్థులు 9989141475 లేదా 94402 45717 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆ సంఘ గౌరవాధ్యక్షులు ఓబులేసు, ఖాదర్‌బాష, ఉపాధ్యక్షులు సుభాన్, సిద్దయ్య, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రిపూట రెస్టారెంట్ల నిర్వహణ సమయాన్ని పెంచాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో రాత్రిపూట రెస్టారెంట్ల నిర్వహణ సమయాన్ని పెంచాలని ఏపీ ఫుడ్స్ అండ్ రెస్టారెంట్స్ జిల్లా అధ్యక్షులు రషీద్ ఖాన్ కోరారు. శనివారం ఆ అసోసియేషన్ సభ్యులు నూతన డీఎస్పీ ఎస్ఎండీ షరీఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హోటల్స్, రెస్టారెంట్ల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలపై డీఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. చిన్నపరెడ్డి, నవీన్, సంతోష్, షంషీర్, కిరణ్ కుమార్, పల్లె క్రిష్టారెడ్డి, జైనుల్, మస్తాన్ పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో శనివారం బీజేపీ నాయకులు పర్యటించి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. 25వ డివిజన్‌లో బీజేపీ నాయకులు పర్యటించారు. దేవుని కడప రోడ్డులోని కొత్త మార్కెట్‌లోపల పారిశుద్ధ్య లోపం, దుర్వాసన, మార్కెట్ స్థల మార్పిడి, పబ్లిక్ టాయిలెట్ల వినియోగం తదితర అంశాలపై స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ యాదవ్, బీజేపీ జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ జీఎస్టీ లక్ష్మణ్‌రావు, చంద్రమోహన్, ప్రభుకుమార్, కేశవ, కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

– సాక్షి ఎఫెక్ట్



ట్రంకురోడ్డులో పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న కూలీలు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ట్రంకురోడ్డులో బుర్హానుద్దీన్ మసీదు ఎదురుగా తాగునీటి పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా ప్రవహిస్తుండేవి. ఈ విషయంపై ఈనెల 13వ తేదీ సాక్షిలో వార్త ప్రచురితమైంది.దీనిపై నగరపాలక అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: సేవకు ప్రతిరూపం మదర్ థెరీసా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. శనివారం మదర్స్ డే సందర్భంగా మదర్ థెరీసా పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లి ఆశీస్సులు ఎంతో గొప్పవని, ప్రతి ఒక్కరూ ఆమెను గౌరవించి తీరాలన్నారు. తన సేవల ద్వారా దేశ ప్రజలందరితో మదర్ అని పిలిపించుకున్న గొప్ప సేవా మూర్తి మదర్ థెరీసా అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కరిముల్లా, అరీఫ్‌ఖాన్, మోహీద్దీన్‌ఖాన్, హర్షవర్ధన్‌రెడ్డి, బాలిరెడ్డి, కుమార్ పాల్గొన్నారు.